
ఇందిరాపార్కువద్ద నిరసన వ్యక్తం చేస్తున్న చెస్‌క్రీడాకారులు

తెలంగాణలో చెస్ క్రీడను అభివృద్ధి చేయాలి

- తెలంగాణ డెమోక్రటిక్ చెస్ డెవలప్‌మెంట్ కమిటీ

కవాడిగూడ, , ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గ్రామీణ స్థాయి నుంచి గ్రాస్ రూట్‌లో చెస్ క్రీడను అభివృద్ధి చేయాలని తెలంగాణ డెమోక్రటిక్ చెస్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు కంది రవి, అమిత్‌పాల్‌సింగ్, దయాబేతి, మహేందర్, రాజ్‌కుమార్, నరేష్, శ్రీహరిలు కోరారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికలు రాజ్యాంగ బద్ధంగా కాకుండా చెస్ క్రీడాకారులకు స్థానం కల్పించకుండా ఏకపక్షంగా వ్యవహరించి ఎన్నికలు నిర్వహించారని వారు మండిడ్డారు. చెస్ క్రీడాకారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో చెస్ క్రీడలు ఆడుతూ శాంతియుత పద్ధతిలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చెస్ క్రీడాకారులు అభిమానులు పాల్గొన్నారు.


ఇందిరాపార్కు వద్ద జరిగిన ధర్నాలో మున్నూరు కాపు రాష్ట్ర సంఘాల నేతలు

మున్నూరు కాపు కార్పొరేషన్‌కు రెండు వేల కోట్లు కేటాయించాలి

- మున్నూరు కాపు రాష్ట్ర సంఘాల నాయకులు

కవాడిగూడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు కార్పొరేషన్‌కు రెండు వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, మున్నూరు కాపు బిడ్డకు మంత్రి వర్గంలో అవకాశం కల్పించాలని మున్నూరు కాపు రాష్ట్ర సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో మున్నూరు కాపు డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు ఎడ్ల రవిపటేల్, మున్నూరు కాపు యువత విభాగం అధ్యక్షుడు వనమాల ప్రవీణ్ పటేల్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ఆర్. దశరథ్‌పటేల్ మాట్లాడుతూ, మున్నూరు కాపులకు రాజకీయంగా ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రస్తుత ప్రభుత్వంలో మున్నూరు కాపులకు మంత్రివర్గంలో స్థానం లేదని వారు అన్నారు. మున్నూరు కాపుల జనాభా దామాషా ప్రకారం వారి అభివృద్ధి కోసం బడ్జెట్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు బాల శ్రీనివాస్‌పటేల్, దశరథం, మహేందర్, డాక్టర్ పీఎన్‌ఎల్ పటేల్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన మున్నూరు కాపులు పాల్గొన్నారు.


రంగరాజ్‌గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కవాడిగూడ గౌడ సంఘం నేతలు

రంగరాజ్ గౌడ్‌కు గౌడ సంఘం నేతల నివాళి

కవాడిగూడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు కవాడిగూడ గౌడ సంఘం ఛైర్మన్‌గా రంగరాజ్‌గౌడ్ కులస్థులకు ఎనలేని సేవలు అందించారని కవాడిగూడ టాపర్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు దూడల శంకర్‌గౌడ్, కవాడిగూడ గౌడ సంఘం అధ్యక్షుడు సానెం హరీష్‌గౌడ్‌లు అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లడమే నిజమైన నివాళి అని వారు అన్నారు. రంగ రాజ్‌గౌడ్ సంతాప సభను ఆదివారం కవాడిగూడలో నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు, గౌడ కులస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన చిత్రపట్టానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు అంజయ్యగౌడ్, మద్దెల చంద్రయ్యగౌడ్, లింగాల ప్రకాష్ గౌడ్, ప్రతాప్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, సంపత్‌కుమార్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, నవీన్ గౌడ్, జహంగీర్‌గౌడ్, నవీన్‌గౌడ్, అమర్, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌కుమార్‌కు జాతీయ స్థాయి అవార్డు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వెంట్రిలాక్విజంలో అందిస్తున్న సేవలను గుర్తించిన ఎర్లీ చైల్డ్ ఉడ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి అవార్డును అందజేసిందని ఇంటర్నేషనల్ వెంట్రిలాక్విజం ఆర్టిస్ట్ ఎం. సంతోష్‌కుమార్ తెలిపారు. ఆదివారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత్‌తో పాటు యూఎస్ఏ బ్రిటన్, జర్మని లాంటి దేశాలలో విద్యార్థులకు బొమ్మలతో ప్రదర్శనలు ఇస్తూ అవగాహన పెంపొందిస్తున్నానని ఆయన చెప్పారు. టీవీ, సెల్‌ఫోన్‌లు వాడవద్దని పిల్లలు నోట్లో వేలు పెట్టుకోవడం ఆరోగ్యానికి హానికరమని, పర్యావరణ పరిరక్షణ జంక్ ఫుడ్స్ నివారణ తదితర వాటిపై ఆ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించానని ఆయన చెప్పారు.


బొమ్మలను ప్రదర్శిస్తున్న ఆర్టిస్ట్ సంతోష్‌కుమార్

డాక్టర్ సూర్యప్రకాష్‌రావుకు టాప్‌మోస్ట్ హెల్త్ కేర్ లీడర్స్ గ్లోబల్ అవార్డు

రాంనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కేర్ ఆస్పత్రికి చెందిన సీనియర్ ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వి. సూర్య ప్రకాశరావు టాప్‌మోస్ట్ హెల్త్ కేర్ లీడర్స్ గ్లోబల్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరల్డ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కాంగ్రెస్ అండ్ అవార్డ్ 2025 తొమ్మిదవ ఎడిషన్ ఈ అవార్డుకు తనను ఎంపిక చేసినట్లు చెప్పారు. కొన్ని దశాబ్దాలుగా తాను పదివేలకుపైగా గుండెకు సంబంధించిన ఆపరేషన్లు విజయవంతం చేసినందుకు తనకు ఈ అవార్డు వచ్చిందని తెలిపారు. ఈ అవార్డును ముంబాయిలో శుక్రవారం జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో అందుకున్నట్లు ఆయన తెలిపారు. గుండె జబ్బులకు అధునాతనమైన పద్ధతిలో ఆపరేషన్‌తో పాటు అంతర్జాతీయ సదస్సులు నిర్వహించి గుండె ఆపరేషన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు. మెళకవలను వివరించామని చెప్పారు. ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని ఆయనతెలిపారు.

వైఎస్ఆర్ మూర్తి మృతి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సేవా సంస్థ వైజ్‌మెన్స్ క్లబ్‌లో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించిన వైఎస్ఆర్‌గా పేరుపొందిన వై. శ్రీరామచంద్రమూర్తి ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆయనకు 79 ఏళ్లు. భార్య కామేశ్వరి, ఒక కుమార్తె, అల్లుడు, మనవడు ఉన్నారు. కొంతకాలంగా గుండె సంబంధిత అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటూ ఉన్నారు. ఆయన మృతితో సాంస్కృతిక సంస్థల నిర్వాహకులు పలువురు నృత్య సంగీత నాటక కళాకారులు దిగ్భ్రాంతి చెందారు. వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎందరో రాష్ట్ర, రాష్ట్రేతర నృత్య సంగీత కళాకారులకు వేదిక కల్పిస్తూ వారిని ప్రోత్సహించారు. సోమవారం ఆయన అంత్యక్రియలు సైదాబాద్‌లో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

కిటకిటలాడిన ముషీరాబాద్

చేపల మార్కెట్

- పెరిగిన చేపల ధరలు
- కిలో రూ.200 నుంచి 500 వరకు విక్రయం


కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న ముషీరాబాద్ చేపల మార్కెట్

ముషీరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో ప్రజలు చికెన్ తినేందుకు హడలిపోతున్నారు. ఆదివారం కావడంతో మాంసం ప్రియులు చేపలను పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. నగరంలో అతిపెద్దదైన ముషీరాబాద్ చేపల మార్కెట్ తెల్లవారుజాము 3 గంటల నుంచి కొనుగోలు దారులతో కిక్కిరిసి పోయింది. తెలంగాణ, ఏపీలోని వివిధ రాష్ట్రాల నుంచి చేపలు మార్కెట్‌కు పెద్ద ఎత్తున దిగుమతి అయ్యాయి. లారీలు, డీసీఎంలు, భారీ వాహనాలలో 50 నుంచి 60 టన్నుల చేపలు మార్కెట్‌కు దిగుమతి అయ్యాయి. సాధారణ రోజుల్లో ముషీరాబాద్ చేపల మార్కెట్‌కు 20 నుంచి 25 టన్నుల చేపలు దిగుమతి కాగా ఆదివారం బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో వ్యాపారులు పెద్ద ఎత్తున చేపలను దిగుమతి చేసుకున్నారు. కొర్రమీను చేపల ధరలు విపరీతంగా పెరిగాయి. కిలో రూ.500 నుంచి రూ.550కి విక్రయించారు. బొచ్చ, రవ్వ చేపలు పెద్ద సైజ్‌లో ఉన్నవాటిని కిలో రూ. 170 నుంచి రూ. 200లకు విక్రయించారు. కిలో వరకు ఉన్న చేపలను రూ. 140 నుంచి 150కి విక్రయించారు. రొయ్యలు సైతం కిలో రూ. 350 నుంచి 400 కు విక్రయించారు. చేపల ధరలు పెరిగినప్పటికి మార్కెట్‌లో కొనుగోలు దారుల సంఖ్య విపరీతంగా పెరిగింది. మధ్యాహ్నం వరకు అమ్మకాలు పూర్తి అయ్యాయి.

కొనుగోలుదారుల సంఖ్య పెరిగింది



బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ వల్లే ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో కొనుగోలు దారుల సంఖ్య పెరిగింది. ఆదివారం కావడం వల్ల చుట్టుపక్క ప్రాంతాలతోపాటు నగర శివారు నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి చేపలను కొనుగోలు చేశారు.

- ప్రసాద్, వ్యాపారి

చేపల ధరలు బాగా పెరిగాయి



చేపల ధరలు గత వారం రోజులుగా భారీగా పెరిగాయి. సాధారణ రోజుల కంటే ఆదివారం రూ20 నుంచి 50 రూపాయల వరకు అధికంగా చేపల ధరలు పలికాయి. పెద్ద సైజ్‌లో ఉన్న చేపలను ప్రజలు అధికంగా కొనుగోలు చేశారు.

- రావణ్, హోల్‌సేల్ వ్యాపారి

మతసామరస్యానికి ప్రతీక గ్యార్వీ వేడుకలు

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు పవిత్రంగా జరుపుకునే గ్యార్వీ వేడుకలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని బాపూజీనగర్‌లోని జమ్‌జమ్ మసీదు వద్ద మహ్మద్ గౌస్ ఆధ్వర్యంలో గ్యార్వీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు హాజరై మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇరువర్గాల ప్రజలు ఐక్యంగా గ్యార్వీ వేడుకలను జరుపుకోవడం శుభ పరిణామం అన్నారు.


బాపూజీనగర్ మసీదులో ఎమ్మెల్యే ముఠాగోపాల్, తదితరులు


అంజన్‌కుమార్ యాదవ్‌ను సన్మానిస్తున్న మసీదు నిర్వాహకులు

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర మాజీ కార్యదర్శి వెంకటేష్, నాయకులు పట్నం నాగభూషణం గౌడ్, జీఎన్ చారి, రాజ్‌దీప్, లింగంగుప్తా, సురేష్ కుమార్, బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

శ్యాంబాబా మందిరంలో ప్రత్యేక పూజలు


శ్యాంబాబా మందిర్‌లో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి


నిషాన్ యాత్రలో ఎమ్మెల్యే రాజాసింగ్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ వీరన్న గుట్టలోని శ్యాంబాబా మందిర్ నిర్మించి 30 ఏళ్లు నిండిన సందర్భంగా ఆదివారం మూడు దశాబ్దాల వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంబాబా మందిర్‌ను రంగురంగుల విద్యుత్ దీపాలు అరటి తోరణాలతో సుందరంగా అలంకరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్యాంబాబాను రంగురంగుల పూలు, స్వీట్లతో అలంకరించారు. నగర నలమూలల నుంచి భక్తులు నిషాన్ యాత్రగా శ్యాంబాబా మందిర్‌కు చేరకున్నారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, కంచి కామకోటి పీఠాధి పతి జయశంకర్ బాలగోపాల్, కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, శంకర్‌యాదవ్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి భగవంత్‌రావు, బీజేపీ నేతలు కన్నె రమేష్ యాదవ్, గోవింద్‌రాఠి, శ్యామ్‌మందిర్ సేవా సమితి అధ్యక్షుడు చంద్రకాంత్ డకోటియా, కార్యదర్శి ఇంద్రకుమార్ అగర్వాల్, ఉపాధ్యక్షులు రాందేవ్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, ప్రతినిధులు పురుషోత్తం గోయల్ తదితరులు పాల్గొన్నారు.


శంకర్‌మఠంలో జరిగిన మహాశివరాత్రి శివభక్తి సుధ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఓలేటి పార్వతీశం, ఆచార్య గౌరీశంకర్

నేటి యువత ఆధ్యాత్మిక గ్రంథాలు చదవాలి

- శివభక్తి సుధ కార్యక్రమంలో పలువురు వక్తలు

రాంనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నేటియువత ఆధ్యాత్మిక గ్రంథాలు చదవడంపై మక్కువ చూపాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం శంకర్‌మఠంలో మహాశివరాత్రి సందర్భంగా శివభక్త సుధ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దూరదర్శన్ రిటైర్డ్ అధికారి డాక్టర్ ఓలేటి పార్వతీశం, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీ శంకర్, పద్య కళాప్రవీణ ఆచార్య ఫణీంద్ర, సాహితీ ప్రభాస ఎం. దత్తాత్రేయ శర్మ, డాక్టర్ మహంతయ్య, ఆచార్య సాగి కమలాకర శర్మ, డాక్టర్ లలితా వాణి, ధూర్జటిలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మహాశివరాత్రి ప్రాముఖ్యతను వారు వివరించారు. నేటి యువతలో ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించడానికి మహాశివరాత్రి సందర్భంగా శివ భక్తి సుధ కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సాహితీ జీగీష సంస్థ అధ్యక్షుడు బండారు పల్లి రాంచందర్ రావు, వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ పి. విజయలక్ష్మి, ఉపాధ్యక్షుడు రఘుశ్రీ పాల్గొన్నారు.


పీసీ సర్కార్ చిత్రపటానికి నివాళులుఅర్పిస్తున్న రామడుగు వసంత్, వీరయ్య, మల్ల రమేష్ తదితరులు

పీసీ సర్కార్ సేవలు మరువలేనివి

రాంనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తమ అద్భుత ప్రదర్శనల ద్వారా భారత దేశకీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత ఇంద్రజాలకుడు పీసీ సర్కార్ అని తెలుగు రాష్ట్రాల ఇంద్రజాల ప్రముఖులు అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీసీ సర్కార్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెజీయన్స్ గ్రూప్ అధ్యక్షుడు రామడుగు వసంత్, కార్యదర్శి ఆంజనేయులు. తెలుగు మెజీషియన్స్ గ్రూప్ నాయకులు అలీ, ప్రదీప్, హైదరాబాద్ సిటిజన్స ఫోరం కార్యదర్శి కె వీరయ్యలు పాల్గొని పిసి సర్కార్‌చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ బీసీ మేధావుల ఫోరం ఛైర్మన్ చిరంజీవులు

గ్యాస్ డెలివరీ వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలి

- తెలంగాణ బీసీ మేధావుల ఫోరం ఛైర్మన్ చిరంజీవులు

రాంనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ న్యాయమైన డిమాండ్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని తెలంగాణ బీసీ మేధావుల ఫోరం ఛైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు డిమాండ్ చేశారు. కార్మికుల కోసం రూపొందించిన చట్టాలను పకడ్బందీగా అమలు జరిగేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఆయన సూచించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఐదవ మహాసభ అసోసియేషన్ రాష్ట్ర ఇన్‌చార్జి కెవి గౌడ్, అధ్యక్షుడు నకిరెకంటి శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవులు మాట్లాడుతూ కుకింగ్ గ్యాస్ డెలివరీ కార్మికులుగా అధిక శాతం పేద మధ్య తరగతి వర్గాల ప్రజలే పనిచేస్తున్నారని వారికి కార్మిక చట్టాల ప్రకారం వేతనాలు చెల్లించడం ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించడం ఆరోగ్య సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో నాయకులు మంగలిపల్లి శంకర్, నల్లా లక్ష్మణ్, బుర్రా చంద్రయ్యగౌడ్, రమేష్, అజయ్‌రెడ్డి, నర్సింగ్, రాజేష్, రాకేష్, రాజశేఖర్, రంజిత్, సుధాకర్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ బర్కత్‌పుర బాగ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం రాంనగర్ చౌరస్తాలో అఖిల భారత గోష్ దివస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

-రాంనగర్, ఆంధ్రజ్యోతి


ఇందిరాపార్కులో వాకర్స్‌ను కలిసి బీసీ కులగణనపై అవగాహన కల్పిస్తున్న బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, గుర్రం శంకర్, తదితరులు

కులగణనను సద్వినియోగం చేసుకోవాలి

- బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్

కవాడిగూడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో పాల్గొనని వారికోసం రీ సర్వే కొనసాగుతుందని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్ తెలిపారు. కులగణన సర్వేలో మూడు పద్ధతుల ద్వారా నమోదు చేసుకోవచ్చని గ్రేటర్ హైదరాబాద్‌లో వార్డు కార్యాలయాలల్లో, జిల్లాలతో అయితే ఎంపీడీఈఓ కార్యాయాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకునమోదు ప్రక్రియ ఉంటుందని ఆయన తెలిపారు. బీసీలలో వాస్తవ జనాభాను గుర్తించడానికి రీ సర్వే నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. ఆదివారం కవాడిగూడ ఇందిరాపార్కులో ఉదయం వాకర్స్‌తోపాటు దోమలగూడ, గాంధీనగర్, బండమైసమ్మనగర్, కవాడిగూడ, అశోక్‌నగర్ తదితర ప్రాంతాలలో పర్యటించి కులగణన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, గుర్రం శంకర్, చంద్రకళ, ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్ యాదవ్, ఇందిరాపార్కు మేనేజర్ ఆశిష్, సూపర్ వైజర్ మౌనిక, వాకర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


సీతామార్కండయ్యకు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి ఆంజనేయులు, బింగి నవీన్

హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా సీతామార్కండయ్య

ముషీరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీలోని ప్రసిద్ధిగాంచిన సంజీవ హనుమాన్ దేవాలయ నూతన కమిటీ అధ్యక్షుడిగా సీతామార్కండయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో జరిగిన కాలనీ సర్వసభ్య సమావేశంలో సంజీవ హనుమాన్ దేవాలయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా సీతామార్కండయ్య, ఉపాధ్యక్షులుగా దావత్ మచ్చేంద్రనాథ్, జితేందర్, ప్రధాన కార్యదర్శి పుండరీకం, సంయుక్త కార్యదర్శి బి.వినోద్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎ.వెంకటేష్, కోశాధికారి గడ్డం నవీన్, సలహాదారులుగా బింగి కృష్ణ, ఆర్ ఆంజనేయులు, శ్యామల పద్మలను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా సీతామార్కండయ్య మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేస్తానని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. బౌద్ధనగర్ పరిధిలోని కౌసర్ మసీదు, వారాసిగూడ, ఆర్ట్స్ కాలేజ్, బాలాజీ కమ్యూనిటీహాల్ చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

'భార్యాభర్తల బంధం పవిత్రమైంది'

చిక్కడపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మంలో భార్యాభర్తల బంధం ఎంతో పవిత్రమైందని ఎస్‌వీ యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. పద్మశ్రీ డా. కె విశ్వనాథ్ 95వ జయంతి సందర్భంగా శిఖరం ఆర్ట్ థియేటర్స్, రఘు అరికపూడి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుభ సంకల్పం శీర్షికతో ఆదివారం త్యాగరాయగానసభలో అనురాగదంపతుల పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరై ఇనాక్, శ్రీనివాస్‌గుప్తాలు ఈ సందర్భంగా హెచ్ఎండీఏ డైరెక్టర్ కొమ్ము విద్యాసాగర్, డా. గీతానాగశ్రీనాథ్, ఎం. అమరేష్, మన్నెం వెంకటరెడ్డి, మన్నెం వసంత, వేమూరి అనంత రామకృష్ణశర్మ- వేమూరి మంజుల, బింగి నరేందర్‌గౌడ్- జ్యోతిగౌడ్‌లకు అనురాగ దంపతుల పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భర్తల విజయం వెనుక భార్యల ప్రోత్సాహం ఎంతో ఉంటుందన్నారు. సంఖ్యాశాస్త్రవేత్త దైవజ్ఞశర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చక్రపాణి, అరికపూడి రఘు, శివనరసింహన్ తంత్ర, ప్రతాప్‌వంశి, గొల్ల కృష్ణ పాల్గొన్నారు. తొలుత సినీగీతాల ఆలాపన, నాట్యకార్యక్రమాలు అలరించేలా జరిగాయి.


సమావేశంలో మాట్లాడుతున్న వేదకుమార్ వేదికపై వినయ్‌కుమార్, భూపతి వెంకటేశ్వర్లు తదితరులు

పిల్లల లైబ్రరీ ప్రారంభం

రాంనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పేద పిల్లల కోసం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవ సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన పిల్లల లైబ్రరీ ఎంతగానో దోహదపడుతుందని బాల చెలిమి పత్రిక ఎడిటర్ మణికంఠ వేదకుమార్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పిల్లల లైబ్రరినీ ఆయనముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పాఠ్య పుస్తకాలతో పాటు పార్టీ యేతర పుస్తకాలు కూడా చదవాల్సిన అవసరం ఉందని పిల్లలకు సూచించారు. సెల్‌ఫోన్ యుగంలో పుస్తకాలు చదవడాన్ని పిల్లలు మానేశారని అన్నారు. విజ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కార్యక్రమానికి సంస్థ అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షురాలు కె సుజావతి, పిల్లల డాక్టర్ పి నళిని, సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్ వినయ్ కుమార్, సంస్థ కార్యదర్శి ఎస్ సోమయ్య, నవీన్, బ్రాహ్మణి, రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ శ్రీ లలితారాం తదితరులు పాల్గొన్నారు.

'దాశరథి, ఆరుద్రల సాహిత్యం సమాజానికి అవసరం'

రాంనగర్ , ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దాశరథి, ఆరుద్రల సాహిత్యం నేటి సమాజానికి ఎంతో అవసరమని, ఆధునిక తెలుగు సాహిత్య రంగంలో తమ కవిత్వంతో ఒక వినూత్న శఖాన్ని సృష్టించిన మహాకవులు దాశరథి, ఆరుద్ర అని ప్రముఖ విమర్శకులు, సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో దాశరథి, ఆరుద్రల శతజయంతి సందర్భంగా సాహిత్య సమాలోచన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలకపల్లి రవి మాట్లాడుతూ అవినీతికి, అరాచక పాలనకు ఎదురు తిరిగి తన కలాన్నే ఆయుధంగా ఎక్కుపెట్టి సింహగర్జన చేసిన మహాకవి డాక్టర్ దాశరథి అన్నారు. అగ్నిధార, రుద్రవీణ, తిమిరంతో సమరం వంటి కథా సంపుటాలు దాశరథి కవితా ఆవేశాన్ని చాటి చెబుతాయాన్నారు. కుషికుషిగా అంటూ ఎన్నో సినిమా పాటలు రాసి వెండితెరపై తన ముద్రను పదిలంగా ప్రతిష్ఠిరించారని చెప్పారు. తెలంగాణ పోరాట దృక్పథంతో త్వమేవాహం వంటి కావ్యాన్ని రాసిన మహాకవి డాక్టర్ ఆరుద్ర దానిని ప్రశ్నించిందని దాశరథి అని చెప్పారు. హైదరాబాద్ బుక్ ఫేర్ అధ్యక్షుడు కవి యాకుబ్ మాట్లాడుతూ తెలంగాణ సాహితీ వినూత్న కార్యక్రమాలు చేస్తుందన్నారు. అందులో భాగంగానే దాశరథి. ఆరుద్ర మహాకవుల శతజయంతి సమాలోచన సదస్సు నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో కవి గేయ రచయిత, డాక్టర్ తిరుమలగిరి శరత్‌చంద్ర, అనంతోజు మోహన కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.